# బాపూ బొమ్మ - 3

ఆ తరువాత మరి రెండు రోజులకే అత్తగారు రత్తాలును మెత్తగానే చీవాట్లు పెట్టడం విన్నాను.

“ఆ సూరమ్మతో ఏం వాగావే? కోడలు గంగిగోవులాంటి పిల్ల అన్నావట కదా...? అంటే – నేను గంపగయ్యాళినని నీ ఉద్దేశం... అవునా...? ఇంత ఆస్తికి మావాడు ఒక్కడే వారసుడా... అయినా కానీ కట్నం అడగకుండా కోడల్ని చేసుకున్నా. ఎవరు గొప్పంటావ్... నీకేం తెలిసి ఏడుస్తుంది, నేనీ ఇంటికి వచ్చేటప్పుడు ఎంత కట్నం ఇచ్చామో, వెంట సారెగా ఎన్ని సామాన్లు తెచ్చానో.. నగా నట్రా నాకెంత ఉండేదో నీకెలా తెలుసూ...! అయినా సరే. మా అత్త లోకువ కట్టి చీటికీ మాటికీ మొత్తుతూనే ఉండేది. ఎంత కోపం వచ్చినా నోరుపెట్టుకుని అరవటమేగానీ,  కోడలి మీద చేయి చేసుకున్నానా? నా మంచితనం గురించి కోడలు మహారాణికే అర్థం కావటంలేదు. ఇక నీకేం తెలుస్తుందిలే..! “ అంటూ గట్టిగా నిట్టూర్చి, వెంటనే హెచ్చరికలా ఇంకో మాటా చెప్పింది.

‘‘ఎవరైనా ఇంటి విషయలు అడిగితే నీకేం తెలియదని చెప్పు. అంతేగానీ నోటికొచ్చినట్లుగా వాగకు’’

రత్తాలు మెల్లగా గొణుక్కుంటున్నట్లుగా ‘‘నేనేం చెప్పటంలేదు. ఊరందరూ అనుకునేదే. నా నోటికి తాళం వేస్తారుగానీ.. ఊరంతటికీ వెయ్యలేరుగా...’’ అంటూ సాగదీసుకుంది.

అత్తగారు విననట్లు మౌనంగా ఉండిపోవడంతో గొడవ సద్దుమణిగింది.

‘కానీ కట్నం లేకుండా...’ ఈ మాట ఇప్పటికి ఎన్నిసార్లు విన్నానో...  ఇంకా ఎన్నిసార్లు వినాలో...! బహుశా జీవితాంతం భరించాల్సిందేనా..?

పది పుట్ల ధాన్యం లెక్క మాత్రం ఆ కొద్దిరోజుల్లోనే పన్నెండుకి పెరిగిపోయింది.

వాళ్లకున్న ఆస్తిపాస్తులకి... బోలెడంత కట్నం, భారీగా లాంఛనాలూ ముట్టచెబుతామని వచ్చిన సంబంధాలన్నీ కాదనుకున్నారట. ఎందుకో మరి..? నాకు అర్థంకాని ప్రశ్న అది !

మా పిల్లని కనికరించి మీ ఇంటి కోడల్ని చేసుకోండని మావాళ్లు ఈవిడిగారి కాళ్లు పట్టుకోలేదుగదా? తనే కోరి వచ్చానని చెప్పి. ఇప్పుడీ దెప్పిపొడుపులెందుకటా...?

నిజానికి అన్యాయం జరిగింది నాకు మాత్రమే ! చదువు కొనసాగించవచ్చని చెప్పి, తీరా పెళ్ళి అయ్యాక ఇప్పుడేమో కాదన్నారు !  మా పెద్దవాళ్లంతా ఈ సంబంధం పట్ల మిగతా విషయాలకి ఆనందించి ఉండొచ్చుగానీ.. నేను మాత్రం నా చదువుకి ఆటంకం ఉండదనే నమ్మకంతోనే సంతోషంగా తల వూపాను !

ఇపుడు కాదన్నా.. నిలదీసి అడిగే అర్హత నాకు లేదు. ఆ విషయమూ మా అత్త తేల్చి చెప్పేసింది కాబట్టి నా అసంతృప్తినీ, ఆక్రోశాన్నీ లోలోపలే అణచుకోక తప్పదు !

నాకెందుకోగానీ బాబాయ్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఒకసారి సంక్రాంతి పండుగకే కదూ, బాబాయ్ ఊరి నుంచి వచ్చినపుడు, పండగ ముస్తాబులో ఉన్న నన్ను చూసి ‘ బాపూ బొమ్మలా ముచ్చటగా ఉన్నావమ్మా..’ అన్నాడు.

మళ్ళీ వెంటనే ‘‘బాపూ అమ్మాయి బొమ్మ ఎలా ఉంటుందో తెలుసా’’ అనడిగాడు. బాబాయ్ ఎన్నో

పత్రికలు తెచ్చిస్తూ ఉంటాడు. కథలకి బాపూగారి బొమ్మలుంటే ప్రత్యేకంగా, ఇష్టంగా గమనించేదాన్ని.

అందుకేనేమో హుషారుగా బాబాయ్ ప్రశ్నకి సమాధానం చెప్పేశాను.

''చెంపకు చారెడు కళ్లతో, బారెడు వాలుజడతో సన్నగా, పొడుగ్గా అరవిరిసిన మల్లెమొగ్గలా తెలుగుదనం ఉట్టిపడుతూ... అవునా బాబాయ్?'' అన్నాను.

బాబాయ్ ''అవునమ్మా... బాగా చెప్పావ్'' అంటూ నవ్వాడు. ''బాపూగారు గీసిన అమ్మాయిల్లో సొగసు మాత్రమే కాదు, స్వాభిమానం, విజ్ఞానం కూడా ఉట్టిపడుతూంటుందని నాకనిపిస్తుంది ! '' అంటూ తన దగ్గరున్న ఫైలు తీసి బాపూగారి బొమ్మల కలెక్షన్ బయటపెట్టాడు. బాపుగారి బొమ్మలు ఏ పత్రికలో పడినా బాబాయ్ అవన్నీ సేకరించి ఉంచుతాడు. బాబాయ్ హాబీ అది. పేపర్ కట్టింగ్స్‌లో నుండి ఒకటి తీసి చూపిస్తూ ''ఇది నాకు బాగా నచ్చినది.. చూడు'' అన్నాడు.

పుస్తకాల అరలున్న గదిలో.. కుటుంబసభ్యులంతా పుస్తకం చేతపట్టి చదువుకుంటున్న దృశ్యం. పుస్తకాల అలమర దగ్గరే నిలబడి చేతిలోని పుస్తకాన్ని చదువుతున్న తండ్రి, గోడకి ఆనుకుని నేల మీద కూర్చుని బారచాపుకున్న కాళ్ల మీద చంటిబిడ్డను బోర్లా పడుకోబెట్టుకుని ఒక చేతితో పుస్తకం పట్టుకుని, దీక్షగా చదువుతున్న తల్లీ... నేలమీద పుస్తకాలు పెట్టుకుని, వాటి మీదకు ఒరిగి చదివేస్తున్న ఇద్దరు చిన్నారులూ... అలా ఇంటిల్లిపాదీ పుస్తక పఠనంలో నిమగ్నమై ఉన్నట్లుగా... ఆ బాపుబొమ్మ నిజంగా చాలా బావుంది ! చదువుకోవటమనే మంచి అలవాటును ఆ బొమ్మ ద్వారా చెప్పకనే చెప్పటమన్నట్లుగా ఉంది !

''దీనికి నేనే స్వంతంగా చిన్న ఫ్రేము కట్టి నీకు ఇస్తాను. నీ టేబుల్ మీద పెట్టుకో. చదువుకి ఎప్పుడూ చుక్క పెట్టొద్దని నీకు గుర్తుచేస్తుంటుందీ బొమ్మ !" అన్నాడు బాబాయ్.

ఎన్ని అడ్డంకులెదురైనా చదువు మాత్రం ఆపకూడదని మనసులో ఆ రోజే గట్టిగా నిర్ణయించుకున్నాను.

పెదనాన్నల పిల్లలెవరో బాబాయ్ మాటలు విన్నట్లున్నారు. అప్పటినుంచీ నన్ను 'బాపూ బొమ్మ' అని సరదాగా అనటం మొదలుపెట్టారు. అలా అలా ఆ పేరు స్కూల్లోని నా స్నేహ బృందానికీ చేరింది. అలా నన్నెవరైనా అనటం నాకూ మనసులో ఇష్టంగానే ఉండేది ! అవును.. బాబాయ్ చెప్పినట్లుగా బాపూబొమ్మ సొగసుకి మాత్రమే కాక, స్వాభిమానానికీ, వ్యక్తిత్వానికీ దర్పణం !

అయితే.. పెళ్ళిరూపంలో చదువుకి ఆటంకం కలుగుతుందేమోనని కొంచెం భయపడ్డాను గానీ అత్తగారు ఇచ్చిన హామీతో మనసు కుదుటపడింది.

ఉద్యోగం చేస్తున్న ఊరు నుండి నా పెళ్లికని వచ్చిన బాబాయ్‌తో మా అత్తగారు ఇచ్చిన హామీ గురించి సంతోషంగా చెప్పాను.

బాబాయ్ పెదవులపైకి చిన్న నవ్వు వచ్చింది.

అపుడు ఆ నవ్వుకి అర్థం తెలియలేదుగానీ ఇప్పుడు అర్థం అవుతోంది ! నా అమాయకత్వానికి బాబాయ్ 'మనసులో పాపం' అనుకుంటూ నవ్వాడన్నమాట! అయితే ఆ విషయం మనసులోనే పెట్టుకుని నన్ను అనునయిస్తున్నట్లుగా నాలుగు మాటలు చెప్పాడు.

''చూడమ్మా... కాలేజికి వెళ్లి చదువుకోవటం ఒకవేళ కుదరకపోతే, అదొక సమస్యగా మనసులో పెట్టుకుని బాధపడకు. కథలు, నవలలు, జీవిత చరిత్రలూ... ఏ పుస్తకాలైనా చదువుతూండు. ఖాళీ సమయాన్ని పుస్తక పఠనంతోనే సద్వినియోగం చేసుకోవాలి ! మంచి పుస్తకాన్ని మించిన నేస్తం లేదంటారు. చదువుతుండటం వలన నీ ఆలోచనా పరిధి పెరుగుతుంది. సమస్యల్ని పరిష్కరించుకోగలిగే నేర్పూ అలవడుతుంది!

జీవితంలో ఆర్థిక స్వతంత్రానికి ఉద్యోగం చేయాలంటే డిగ్రీలు కావాలి ! నీకు అవసరం లేదు కాబట్టి చక్కగా పుస్తకాల్ని చదువుకుంటూ ఉంటే విజ్ఞానం కలుగుతుంది! నేను కొన్న పుస్తకాలన్నీ ఇక్కడకు తెస్తుంటాను. నువ్వు మీ అత్తగారు వూరు నుండి వచ్చినపుడు అవన్నీ తీసుకెళ్లు. నేను ఇవ్వగలిగేదీ... ఇవ్వాలనుకునేవీ పుస్తకాల బహుమతులే !''

బాబాయ్ మాటలకు నేను ఆనందంగా తల వూపాను.

''ఇదిగో ఇది ఈమధ్యన కొన్న కథల పుస్తకం..'' అంటూ మల్లాది వారి 'అరికాళ్ళ క్రింద మంటలు' కథల సంపుటి నా చేతికి ఇచ్చాడు.

అత్తగారింటికి వచ్చేటప్పుడు అమ్మావాళ్లు ఏవేవో సిద్ధం చేసి ఇచ్చారు గానీ నా అంతట నేనుగా ఇష్టంగా వెంట తెచ్చుకున్నవి బాబాయ్ ఇచ్చిన పుస్తకాలే. మిగతావన్నీ తరువాత వచ్చినప్పుడు తీసుకెళ్ళొచ్చనుకున్నా. కానీ... మళ్లీ ఇంటికి వెళ్ళటమనేది అంత తొందరగా కుదరదని మెల్లగా అర్థం అయింది.

వాటిని ఒక అలమారాలో సర్ది పెడుతున్నప్పుడు, అత్తగారు చూసి మొహం చిట్లించింది. 'ఇవా నువ్వు తెచ్చుకున్నవీ..? బంగారమో, వెండో అన్నట్లుగా అక్కడ నుండి మోసుకుంటూ రావాలా... ఈ మాత్రం చిత్తుకాగితాలు ఇక్కడ దొరకవా...?''

చిత్తుకాగితాలా...? విస్తుపోయాను !

ఇల్లంతా వెతికినా పుస్తకమనేది ఒక్కటి కూడా లేదు.

అత్తగారికి చదవటం రాదు. అందుకనే ఏమో పుస్తకాలంటే చిన్నచూపు.

ఒకరోజు మధ్యాహ్నం పూట ఏదో పుస్తకం తిరగేస్తుంటే చూసింది ''కూటికా, గుడ్డకా...ఎందుకే ఆ చదువు? పెళ్ళయి కాపురానికి వచ్చిన పిల్లకి ఉండాల్సిన లక్షణాలు నీకు ఒక్కటీ ఉన్నట్టు లేదు. వంటా వార్పూ నేర్చుకుందామని, ఇల్లు చక్కదిద్దుకుందామనీ

అనిపించదు... ఇదేం విడ్డూరమో...!''

ఇక అప్పటినుండీ పగలు ఎప్పుడూ పుస్తకం తీయలేదు. ఆవిడకు పెందలాడే నిద్ర పడుతుంది. ఆయనగారెప్పుడో పొద్దుపోయి వచ్చి మంచానికి అడ్డం పడతాడు. కాబట్టి ఆ సమయంలో నాకిష్టమైన పుస్తకం చదువుకోగలిగే వీలు కలుగుతుంది. రేడియో పెట్టడం కూడా మా అత్తగారికి ఇష్టం ఉండదు.

పుస్తకాలు చదవటం, పాటలు వినటం రెండూ ఆమె దృష్టిలో సంసార లక్షణాలు కానే కావు!

అదే మా ఇంటిలో అయితే.. నాన్నమ్మ 'ఒకసారి ఇటు రావే..' అని నన్ను పిలిచినపుడు అమ్మ 'ఏదో

పుస్తకం చదువుకుంటోంది. నేను ఖాళీగానే ఉన్నాగా...ఏంపని చేయలీ..?'అంది.

'ఖాళీగా ఉందనుకుని పిలిచాలే. చదువుకోనియ్యి. ఇంట్లో ఇంతమందిమి ఉన్నాం గదా...అందరం విరగబడి చేయాల్సినంత పనేం ఉంటుంది. దాన్ని చక్కగా చదువుకోమను. మొన్న గుళ్లో, వాళ్ళ మాస్టారు శర్మగారు కనబడి 'మీ మనవరాలు నాలుక మీద సరస్వతీదేవి నాట్యమాడుతోందనుకోండి. ఏ పాఠం చెప్పినా నిముషంలో పట్టేసుకుంటుంది' అన్నారు !ఎంత సంబరమేసిందో..!'' అంది నాన్నమ్మ.

నా చదువు పట్ల ఇంట్లో వాళ్లంతా అంత ముద్దూ మురిపెం చూపించేవాళ్లు. ఇక్కడ మా అత్తగారేమో ఇంత నిరసన... ఈసడింపు!

ఎంత వద్దనుకున్నా నా మనసు ఇలా బేరీజు వేసి చూసుకోవటం మానటంలేదు మరి !

★ ★ ★

ఆ ఇంట్లో ఉన్న ముగ్గురివీ వేరు వేరు దారులు.

ముగ్గురం కూర్చుని ముచ్చటగా కబుర్లు చెప్పుకున్నది లేనే లేదు !నాతో సఖ్యత లేదు సరే... పోనీ వీళ్లిద్దరూ... తల్లీకొడుకులూ ఆత్మీయంగా మాట్లాడుకోవటం కూడా ఎప్పుడూ చూడలేదు. నాకైతే ఈ విషయం విడ్డూరమే !

మా అత్తగారు నాలుగు మాటలు మాట్లాడేది రత్తాలు, నాగన్నతో మాత్రమే.

కొడుకుతో ఎప్పుడైనా మాట్లాడటం అంటూ జరిగితే, డబ్బు గురించే అయివుంటుంది!

అమ్మ అంటే... అవసరాలకి డబ్బు ఇచ్చే బ్యాంకులాంటిదని ఆయనగారు అనుకుంటాడని నా అభిప్రాయం!

ఆ రోజు ఇద్దరూ మాటా మాటా అనుకోవటం విన్నాను. దేనిగురించో అనుకున్నాను గానీ,మామూలే. డబ్బు గురించే!

ఖర్చులు పెంచేస్తున్నాడని అత్తగారు ఆయనను హెచ్చరించింది కాబోలు, అందుకు ఆయన నిష్ఠూరంగా సమాధానం చెప్పటం నాకూ వినిపించింది.

''ఏం చేయమంటావ్..? ఇలాంటి అవసరాలకి పితుక్కోవటానికి వీలుగా పాడి ఆవు లాంటి సంబంధం ఏమైనా చూశావా? వెతికి వెతికి వట్టిపోయిన గొడ్డులాంటి మామగార్ని అంటగట్టావు! అంటే... తప్పెవరిదీ...? నీదేగా...? మరి నేను అడిగానంటే ఇవ్వక నీకు తప్పుతుందా...?''

మా అత్తగారు మాట్లాడలేనిదానిలా కళ్లప్పగించి చూస్తుండిపోతే, ఆయన గారు సరదాగా ''మాట్లాడవేం మాతాజీ...?'' అన్నాడు.

'అబ్బో... ఇంత చమత్కారం ఉందీ..' అని విస్తుపోయాను ఒక క్షణం.

అలా చూడకపోతే కొడుకుని గట్టిగా నిలదీయవచ్చుగా...!

'రోజంతా పనీ పాటా లేకుండా అలా బలాదూర్‌గా తిరిగే బదులు పని పాటా చూసుకోకూడదా..? అటు పొలానికి నాలుగడుగులు వేసి, ఎవరేం చేస్తున్నారో కనిపెట్టి చూస్తే వాళ్లకీ జవాబుదారీ ఉంటుంది...

కొంచెం ఒళ్ళొంచి పని చేస్తారు! ఈ వయసులో అన్నీ చక్కబెట్టుకోవాల్సిన వాడివి... నా ముందు చేయి చాపి అడగటం నీకు సిగ్గనిపించటంలేదా? నీకెప్పటికీ బాధ్యత తెలిసివస్తుంది? ఇంతంత డబ్బు ఏ సరసాలకి తగలేస్తున్నావో ఒక్కసారన్నా చెప్పావా..? అద్దూ, ఆపూ లేని గొడ్డులా విచ్చలవిడిగా తిరగటమే జీవితం అనుకుంటున్నావా?'

అలా చీవాట్లు పెడితే కొంచెం దారికి వచ్చేవాడేమో..! ఆవిడ ఏదో డబ్బు విదిలించడం గురించి గొడవ పడుతుందేగానీ బుద్ధి చెప్పదు.

తండ్రిలేని పిల్లాడని అల్లారుముద్దుగా పెంచానని చెప్పుకుంటుంది!

అంతేగానీ దారి తప్పిన కొడుకుని దండించాలనే ఆలోచనే రాదు! తండ్రి లేకపోతే అడిగినంతా ఇచ్చేస్తే... ఆ లోటు తీరిపోతుందా? అసలు తండ్రి లేడు కాబట్టి ఇంకా రెట్టింపు బాధ్యతతో కొడుక్కి బుద్ధులు చెప్పాలనుకోవద్దూ....?

ఒక్కోసారి.. అనవసర ఖర్చులకి తగలేస్తున్నాడని విసుక్కోవటం... ఇంకోసారేమో... ఇంత ఆస్తికీ ఒక్కడేగా వారసుడు, అనుభవించనీ...' అంటూ ఉంటుంది ! ఒక స్థిరమైన అభిప్రాయం ఉన్నట్లు కనిపించదు!

ఇద్దరికీ ఇద్దరే..! వాళ్ళ మధ్య డబ్బుదే ప్రధాన పాత్ర! అది లేకపోతే వాళ్ళకి మాటల అవసరమే ఉండదనుకుంటా!

కొడుకు మాటలకు ఆశ్చర్యం నుండి తేరుకున్న అత్తగారు నోరు విప్పి కస్సుమంది.

''ఇందులో నేచేసిన తప్పేం ఉందిరా..? ఇదంతా నీ వల్లే జరిగింది! ఆ నాగసుందరి మహాతల్లిని చెప్పాపెట్టకుండా ఇంటికి తీసుకువచ్చి నా నెత్తిమీదకు ఎక్కిస్తావేమోనని భయపడి చచ్చాను. అలా దడ పుట్టించింది నువ్వేగా...! అందుకే కదూ, ఎవరో చెప్పిన మాటల్ని పట్టుకుని ఆ పల్లెటూరుకు వెదుక్కుంటూ వెళ్ళి ఈ బోడి బొమ్మను తెచ్చుకోవాల్సి వచ్చింది! ఒంటిమీదున్న ఆ ఒకటి రెండు నగల్లో కూడా బంగారం ఉండీ లేనట్లుగా ఉంటుంది. అంత నాజూకు నగలు ! ఏం చేస్తాం.... నా తప్పుకు నన్ను నేనే చెప్పెట్టుకుని కొట్టుకోవాలి అంటూ గట్టిగా నిట్టూర్చింది.

''అవును కదా...!'' అంటూ ఆయనగారు పెద్దగా నవ్వారు. ''ఒంటినిండా బంగారపు తొడుగు ఉన్న పిల్లేమో నీకు నచ్చలేదుగా...!''

''సడేలే సంబడం! దానిది ఊరంత నోరు! అదిగానీ కోడలై ఉంటే.. ఇద్దరం దానిని చేయిచాపి అడ్డుక్కోవాల్సి వచ్చేది! ఇప్పుడు మాత్రం నీకేం తక్కువైందీ... పొద్దస్తమానం దానితోనే వూరేగుతున్నావుగా..'' అంటూ అత్తగారు సాగదీసింది.

''అవును. ఈ మాట నేను పెళ్లికి ముందే చెప్పానుగా... ఇపుడు కొత్తగా తెలిసినట్టు మాట్లాడతావేం...?''

''కొంగుకి కట్టేసుకునే కోడలు పిల్ల వస్తుందనుకుంటే నా ఖర్మ ఇలా ఉంది... మూగమొద్దు వచ్చింది. మాటలతో ఆకట్టుకోవటం మాట అటుంచి ... అసలు మాటలే రానట్లుంటుంది.''

"నీకూ నాకూ ఆవిడగారి కబుర్లు అర్థం కావులే.. కళ్లతోనే చెప్పేస్తుంటుందన్నమాట ! చూడు...

అన్నింటికీ కళ్ళు పెద్దవి చేసుకుని ఎలా చూస్తుంటుందో...!" ఇది ఆయనగారి ఎగతాళి!

వాళ్ళ మాటలు నేను వింటున్నాననీ, మనసు కష్టపెట్టుకుంటానేమోననే ఆలోచనే ఇద్దరికీ లేదు!

వింటే ఏమౌతుందీ... ఏం చేయగలదూ... అనే ధీమా!

అవును... ఆ మాట నిజమే! నేను చేయగలిగిందేమీ లేదు!

అయితే మా పెళ్ళి జరగటానికి కారణం ఏమిటో మునుపు నాకు అర్థమయ్యేది కాదు! కానీ కట్నం లేకుండా .. గొప్పింటి కోడలినయ్యానంటూ అత్తగారు ఎందుకు బాధపడుతోందో తెలిసేది కాదు. ఆవిడే నన్ను కోరి కోడలిగా చేసుకుంది కదా,అనుకునేదానిని. అసలు కారణం ఇప్పుడు కొంచెం అర్థమయ్యీ, కానట్లుగా తెలిసింది.

ఆ నాగసుందరి ఎవరో కోడలైతే, తన పెత్తనం సాగదని తెలిసిన అత్తగారు, ఆమెకి తెలియకుండా కొడుకు ఆ సుందరిని పెళ్లి చేసేసుకుంటాడేమోననే భయంతో సరిగా కట్నకానుకల స్థాయిలేని కుటుంబంలోని అమ్మాయైతే తన మాటకు నోరెత్తి జవాబు చెప్పలేదనీ... ఆ ఉద్దేశంతో మాత్రమే.. అత్తగారు మా ఇంటికి వచ్చింది! ఆ అభిప్రాయాన్ని దాచిపెట్టి అందచందాలు, తెలివితేటలు అంటూ అందర్నీ నమ్మించింది! తేనెలొలికే ఆ మాటలకు అందరం మురిసిపోయాంగానీ... ఆయనగారి గురించి ఈ వూరులో వాకబు చేసి వుంటే... నాగసుందరితో వున్న ప్రేమ వ్యవహారం తెలిసి ఉండేది!

అత్తగారు చేసిన గారాబంతో స్నేహితులు, పేకాట అంటూ ఇల్లు పట్టకుండా తిరుగుతుంటాడని అనుకునేదాన్ని. పేరుకి మాత్రమే పెళ్లి చేసుకుంటానని ముందే చెప్పాడన్నమాట! అందుకే నేను ఆ ఇంటికి కోడలినయ్యానుగానీ అతనికి భార్యను కాలేకపోయాను ! అందుకు నాకెందుకోగానీ బాధ కలగలేదు. కేవలం' నా చదువు ఆగిపోయింది' అన్నదే నన్నెక్కువ బాధపెట్టింది!

ఆయన పట్ల మమతానురాగాలు వంటివి ఏవీ కలగకపోయినా... వివాహ బంధంతో రవంత ఇష్టం ఉండేది. ఆ సంభాషణ విన్నాక అది ఆవిరైపోయింది! ఆయన పట్ల అనురాగం, అత్త పట్ల అభిమానం పెంచుకోవాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు సరికదా... ఇంకా వైముఖ్యం మాత్రం పెరిగిపోతోంది! ఆ నాగసుందరి ఎవరు... ఆ వివరాలు తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది గానీ ఎవర్నీ అయినా అడగడం బావుండదనీ, అనవసరమనీ వూరుకున్నాను.

అయితే ఆ తర్వాత నాలుగు రోజులకే రత్తాలు ఏదో మాటల సందర్భంలో అంది'' ఆ నాగమ్మగానీ ఈ ఇంటికి కోడలుగా వచ్చి ఉంటేనా... అబ్బో... ఇల్లు రణరంగంలా ఎంత రంజుగా ఉండునో...!'' అంటూ పకపక నవ్వి ''ఇప్పుడేం ఉందీ... మీరేమో మాటకు మాట చెప్పే రకం కాదు. అత్తగారేం చెప్పినా డూ డూ బసవన్నలా తల వూపేస్తారు. ఇక పోట్లాటలు ఏం ఉంటాయి లెండి!'' అంది.

పుట్టింట్లోనేమో నేను బాపుబొమ్మని!

అత్తగారు, ఆయనగారు ఇచ్చిన బిరుదులు... బోడిబొమ్మ, మూగమొద్దు!

అఖరుకు రత్తాలు కూడా 'డూ డూ బసవన్న' అని ఓ పేరు పెట్టేసింది!

అత్త, ఆయన చేసే అవమానాలకీ, వాళ్ళ మాటలకీ మనసులో ఎంత వేదన అనుభవిస్తున్నానో ఎవరికీ తెలియదు!

ఎవరైనా నన్ను అనవసరంగా చిన్నమాట అన్నాసరే, వెంటనే సమాధానం చెప్పేసే తత్త్వం నాది!.

ఇక్కడకు వచ్చేముందు అమ్మా నాన్నలు చెప్పిన హితవచనాల ప్రభావం వల్ల ఎదురు మాట్లాడకుండా నిగ్రహం చూపిస్తున్నాను!.

దానికి ఫలితం... మూగమొద్దు అన్న పేరు!

నవ్వొచ్చింది! ఏడవలేక నవ్వటం అంటారు... ఈ పరిస్థితినే కాబోలు!

★ ★ ★

అత్తగారు మధ్యాహ్నపు నిద్ర తీరాక ఇంటిముందు వరండాలో ఓ పెద్ద కుర్చీ వేయించుకుని కూర్చుని వీధిని పోయే జనాలను చూడటం అలవాటు.

ఆ రోజు ఎవరినో ''నువ్వెందుకు వచ్చావిక్కడకీ..?'' అని అత్తగారు గదమాయించడం వినిపించింది. ముందుగదిలో కొద్దిగా తెరిచివున్న కిటికీలోనుండి ఎవరై ఉంటారా అని చూశాను. ''ఇక దయచెయ్యి...'' అని వెంటనే విసుక్కోవటమూ విన్నాను.

ఎవరో అమ్మాయి వయ్యారంగా నిలబడి పైట చెంగును చుట్టబెట్టి తిప్పుతోంది. అత్తగారి గదమాయింపుకు అంతే తీవ్రంగా జవాబు చెప్పింది.

''నీ కొడుకు రెండు రోజులుగా కనబడకపోయేసరికి వూరెళ్ళాడా, జ్వరం వచ్చి మంచం ఎక్కాడా అని తెలుసుకోవటానికి వచ్చాలే. పోక నేనేం తిష్టవేసుక్కూర్చోను. నువ్వేం పొమ్మని చెప్పనక్కర్లేదు!''

''వాడెక్కడికి వెళ్ళాడో నాకేం తెలియదు. నేనే అడగను ఆ వివరాలు. నీకెందుకు చెప్పూ...?''

''నీకు చెప్పకపోతే మానే.. కానీ.. నాకు చెప్పకుండా వెళ్ళాడంటే... ఏదో అర్జంటు పని అయివుంటదిలే! అయితే మాత్రం.. రెండు రోజులు కంటికి కనిపించకుండా పోతే, నేనేం అనుకోవాలీ.. రానీయ్ అడుగుతా.. గట్టిగా..!''

అప్పటికి నాకు అర్ధమైపోయింది... ఆ అమ్మాయి ఆయన పెళ్ళి చేసుకోవాలని ఉవ్విళ్ళూరిన నాగసుందరి అని!

అపుడు ఆ అమ్మాయిని తేరిపార చూశాను.

మేకప్ పూర్తి చేసుకుని స్టేజి ఎక్కటానికి సిద్ధంగా ఉన్న డ్రామా ఆర్టిస్టులా అనిపించింది నాకు!

ఆయనగారి అభిరుచి ఏమిటో ఆ అమ్మాయి అలంకరణను బట్టి తెలుసుకోవచ్చన్నమాట!

''సరేలే... ఎలాగూ వచ్చాగా, ఏరికోరి చేసుకున్న నీ కోడల్ని పిలు... చూసిపోతా...'' అదోరకంగా నవ్వుతూ అంది.

''నా కోడలు బొమ్మలాగ నాకు నచ్చినట్లే ఉంటుందిగానీ... నువ్వేం చూడనక్కర్లేదు.. ఇక దయచేయి..! '' అత్తగారు రుసరుసలాడింది.

అదేం పట్టించుకోనట్లు ఆ అమ్మాయి పక పక నవ్వింది.

''అబ్బో... బొమ్మ అయితే... బీరువాలో దాచిపెట్టుకో... చూడాల్సిన అవసరం నాకేం లేదులే! నువ్వు బాగానే చెప్పుకుంటున్నావే... మరి నీ కొడుకేమిటీ, నాతో పల్లెటూరి గబ్బిలాయి అన్నాడే...!'

''ఛీ...ఛీ...నీ కస్సలు సిగ్గులేదే...!'' అత్త నెమ్మదిగా సణగటం నాకు వినిపించింది.. ఆ సుందరి అలా వయ్యారంగా వూగుతూనే, ''సర్లే... మీ గోల నాకెందుకుగానీ... నే పోతన్నా... నీ కొడుకు ఇంటికి రాగానే నేను వచ్చి వెళ్ళానని చెప్పూ...!'' ఆర్డరేసినట్లుగా చెప్పి నవ్వుకుంటూనే వెళ్ళిపోయింది.

కుర్చీని పెద్ద చప్పుడుతో వెనక్కితోసి చిటపటలాడుతున్నట్లుగా లోపలికి వస్తున్న అత్తగారిని ''ఎవరా అమ్మాయి...?'' అనడిగా.

''వాడి నెత్తికెక్కి కూర్చున్న శనిదేవత! మేనకోడలి వరసే! నేను కోడల్ని చేసుకోలేదని దానికి నా మీద దుగ్ధ! అప్పుడప్పుడూ నన్ను కవ్వించటానికి వచ్చి పోతూంటుంది! పెళ్ళయి ఇంకోవూరు పోతుంది కదా, పీడ విరగడవుతుందనుకుంటే.. దీని భాగోతాలు తెలిసి సంబంధాలు వెనక్కి పోతున్నాయ్.. ఖర్మ...! నువ్వూ ఉన్నావు... ఎందుకూ... కట్టుకున్నోడిని ఆకట్టుకోవటం తెలీదు.. దద్దమ్మవి!'' రుసరుసలాడుతూ లోపలికి విసవిసా వెళ్ళిపోయింది అత్తగారు.

నిర్ఘాంతపోతూ రెండు నిముషాలు బొమ్మలా నిలబడిపోయాను!

నిష్కారణంగా నింద భరించాల్సిరావటం అంటే.. ఇదే!

మనసులో ఎవరినో పెట్టుకుని నాతో పెళ్ళికి అంగీకరించటం.. ఆయన గారి తప్పు! ఆస్తి అంతా అమ్మపేరు మీదే ఉంది కాబట్టి, ఆవిడ మాట వింటున్నట్లుగా నాతో పెళ్ళికి తల వూపటం ఎందుకు?

ఆవిడ మాట వినకపోయినా, ఆవిడ ఆస్తిని కొడుక్కివ్వక ఏం చేసుకుంటుంది? బయటవాళ్ళకి పైసా అయినా విదల్చని ఆమె మనస్తత్వం ఆయనకు బాగానే తెలుసుకదా. అలాంటప్పుడు అపుడే నాగసుందరినే చేసుకుంటానని పట్టుబట్టవచ్చుగదా..?

అత్తగారేమో.. తన పెత్తనానికి గండి పడుతుందేమోననే భయంతో కొడుకుని ఇష్టమైన అమ్మాయితో పెళ్ళికి అంగీకరించకపోవటం ఎందుకూ...? డబ్బు విషయంలో తన జాగ్రత్తలో తానుంటే సరిపోయేదిగా..!

ఈ తప్పులు వాళ్ళు చేసి, పెళ్ళి పేరుతో నన్ను చదువుకి దూరం చేసి ఈ ఇంటికి బందీని చేశారు!

నిరపరాధిని.. నన్ను శిక్షించామని తెలుసుకోకుండా.. నిత్యమూ వేధింపులొకటి..! కట్న కానుకలనే ప్రవేశరుసుము లేకుండా అక్రమంగా ఆ లంకంత కొంపలోకి ప్రవేశించానంటూ చిన్నచూపు!

ఆత్మీయత అనేదే లేని మనష్యుల మధ్య బ్రతకాల్సిరావటం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు!

మా అత్త అన్నట్లు నేను నిజంగా దద్దమ్మనే...!

భోషాణంలోని వెండి బిందెలూ, అత్తగారు ఇవ్వబోయే ఏడువారాల నగలూ.. ఏవీ నన్ను మురిపించటం లేదు మరి! మా అత్తగారి దృష్టిలో అదీ తప్పే!

నా అసంతృప్తీ, ఆక్రోశం ఎవరికీ పట్టదు! దిగమింగటం తప్ప మరోదారి లేదు!